క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ

పాకాల: విద్యార్థుల స్థాయికి తగ్గట్టు విద్యాబోధన చేసినప్పుడే వారు బాగా అర్థం చేసుకుంటారని ఎంఈఓ బాబ్జి అన్నారు. బుధవారం మండలంలోని పోలవరపు ఇండ్లు, బందార్లపల్లె, మల్లెల చెరువు పాఠశాలలను తనిఖీ చేశారు. టీచర్లు, విద్యార్థులతో మాట్లాడారు. అవసరమైన సందర్భాలలో ఉపాధ్యాయులు తరగతిలో విద్యార్థుల మధ్య కూర్చుని పాఠాలు చెప్పాలన్నారు. హెచ్ఎం రాధాదేవి, సునీకర్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన ప్రయాణ సౌకర్యాలే లక్ష్యం



మాట్లాడుతున్న డీపీటీఓ జగదీష్

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) జగదీష్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని తన కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ ఉద్యోగుల అసోసియేషన్ల నేతలతో సమావేశమై ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘాల నేతల నుంచి సూచనలు-సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, ఏఓ చాందిని, తిరుమల, అలిపిరి డిపోల మేనేజర్లు మునిచంద్ర, హరిబాబు పాల్గొన్నారు.

శభాష్..రుక్మిణి



తిరుపతి సిటీ: ఆంధ్ర 5వ బెటాలియన్ గర్ల్స్‌కు చెందిన పద్మావతి డిగ్రీ/పీజీ కాలేజీ విద్యార్థిని పి.రుక్మిణిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఆల్ ఇండియా న్యూఢిల్లీ తల్‌సైనిక్ క్యాంప్‌కు తమ విద్యార్థిని ఎంపిక కావడం గర్వకారణమని,అలాటే గత నెల అనంతపురంలో జరిగిన ఏఐటీఎస్సీ విభాగంలో టెంట్ ఫిట్టింగ్ కాంపిటీషన్‌లో తమ బృందంతో కలిసి బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు.

'మామండూరు తుడా లేఔట్ సమస్య పరిష్కారం'



సమీక్షిస్తున్న తుడా చైర్మన్, జేసీ

తిరుపతి తుడా: చంద్రగిరి మండలం మామండూరులోని తుడా లేఔట్‌లో 139 ప్లాట్లకు సంబంధించి పదిరోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో జేసీ శుభం బన్సాల్‌తో కలసి అధికారులు, బాధితులతో తుడా చైర్మన్ సమీక్షించారు. 22-ఏలో ఉన్న మామండూరు తుడా లేఔట్ భూములను 22-ఏ నుంచి తొలగించి కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొత్త జీఓ తీసుకుని వచ్చినట్టు చెప్పారు.

సైరాభానుకు డాక్టరేట్



తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని ఎస్‌వి. సైరాభానుకు డాక్టరేట్ ప్రకటించినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె ప్రొఫెసర్ కాత్యాయిని (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్) పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ఆన్ ఎంప్లాయీస్ పెర్ఫార్మెన్స్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ ఆఫ్ సౌత్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రస్తుతం ఆమె ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

రామచంద్రాపురం: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల భాగస్వామ్యంపై అధికారులు వివరించారు

ఎస్వీయూలో 20న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 9ఎమ్ఎన్‌సీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

తిరుమలలో వృద్ధుడి మృతి

తిరుమల : వైఎస్సార్ జిల్లా లింగాల మండలానికి చెందిన ఓ భక్తుడు బుధవారం తిరుమలలో మృతి చెందాడు. లింగాల మండలం పార్నపల్లికి చెందిన మాదాల వెంకటయ్య(61) అద్దె గదుల ప్రాంతంలో మృతిచెంది పడి ఉండగా స్థానికులు గుర్తించి తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. భక్తుడికి గుండె పోటు రావడంతో మృతిచెందినట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతుని కుటుంబసభ్యులకు సమాచారాం చేరవేశారు. ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడా.. లేక మరేదైనా కారణంతో చనిపోయాడా? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జల దిగ్బంధం.. చదువులకు అంతరాయం



కళాశాలను ముంచెత్తిన మురుగు, వర్షపు నీరు

స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజుల నుంచి జల దిగ్బంధంలోనే విలవిలలాడుతోంది. భారీ వర్షానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురుగు, వర్షపునీరు చేరడంతో ఈ దుస్థితి ప్రాప్తించింది. దీంతో కళాశాలకు రెండ్రోజులు సెలవు సైతం ప్రకటించారు. బుధవారం కళాశాలను టీటీడీ డీఈఓ వెంకట సునీల్ పరిశీలించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న గేట్లను మూసి వేసి కళాశాల మధ్యలో ప్రధాన గేటును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ, ప్రవీణ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. - తిరుపతి సిటీ

ఆప్సీ వైస్ చైర్మన్‌కు సన్మానం





ప్రొఫెసర్ విజయ భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, ఫిజిక్స్ హెచ్‌ఓడీ దేవప్రసాద్‌రాజు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.విజయ భాస్కర్‌రావు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్-1గా నియమితులవడంతో వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆయన్ను సత్కరించింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, సుబ్రమణ్యం, మీడియా కో-ఆర్డినేటర్ మనోజ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో..

ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులు కావడం వర్సిటీ గర్వకారణమని హెచ్‌ఓడీ ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విజయవాడలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో బుధవారం ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు.

క్షయ రోగులకు కిట్లు..భక్తులకు అన్నప్రసాదాలు





కిట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాయులు తదితరులు, అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని తమ కార్యాలయం వద్ద క్షయ రోగులకు ఉచితంగా టీబీ కిట్లు, తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద బీజేపీ నేత గుండాల గోపినాథ్‌రెడ్డి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మోదీ పేరిట అర్చనలు చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి, అజయ్‌కుమార్, జిల్లా కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ శైలజ రుయా ఆసుపత్రి టీబీ కార్యాలయ సిబ్బంది, బండి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నేతలు చంద్రారెడ్డి, గాలి పుష్పలత, నవీన్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రాయల్, గంధం వెంకటముని, కట్టమంచి చంద్రబాబు, సుధాకర్, సురేష్ స్వామి, జేజిరెడ్డి, కేఎస్. రాజా, లోకనాథం, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎంఏవై 2.0 అంగీకార్ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి తుడా: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 హౌసింగ్ పథకం పోస్టర్లను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వారికి లబ్ధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హౌసింగ్ డీఈ మోహనరావు, పీఎంఏవై ప్రతినిధులు డాక్టర్ కాటమరాజు, సంధ్య, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈలు సంతోష్, వినోద్, రాజేష్, అమెనిటీ సెక్రటరీలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్, అధికారులు

గడువులోపు రీసర్వే పూర్తి చేయండి

తిరుపతి సిటీ: నగరంలో నిర్వహిస్తున్న రీ-సర్వే (నక్ష) పనులు గడువు లోపు పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల రీ-సర్వే పనులను కమిషన ర్ పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం





అభిషేక కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న స్వర్ణకారులు, మహిళలు , విశ్వకర్మ జయంతి వేడుకల్లో డీఆర్‌ఓ, అధికారులు

తిరుపతి కల్చరల్: స్థానిక గాలివీధిలోని శ్రీకాళికమ్మ ఆలయంలో బుధవారం స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత బెస్తవీధి కావమ్మ గుడి నుంచి మహిళలు అభిషేక జల కలశాలను మేళ తాళాల మధ్య ఊరేగింపుగా కాళికమ్మ ఆలయానికి చేరుకుని విశ్వకర్మ విగ్రహానికి అభిషేక పూజలు, యజ్ఞం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం విశ్వకర్మ భగవాన్‌ను రథంపై కొలువు తీర్చి పురవీధులలో ఊరేగించారు. తిరుపతి నగర స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ఎం.కార్తీక్ ఆచారి, కార్యదర్శి ఎం.శివా ఆచారి, కోశాధికారి ఎస్. బాబు ఆచారి, సుబ్రమణ్యం, ఆర్.రమేష్, వాసు ఆచారి, స్వర్ణకారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొట్టమొదటి వాస్తుశిల్పి విశ్వకర్మ : డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: మొట్టమొదటి వాస్తుశిల్పి విశ్వకర్మ యేనని డీఆర్వో నరసింహులు కీర్తించారు. బుధవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతిని బీసీ వెల్ఫేర్ అధికారులు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి డీఆర్వో నివాళులు అర్పించి మాట్లాడారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రమేష్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భద్రతపై సమన్వయ సమావేశం

తిరుమల: ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆధ్వర్యంలో టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసు, టీటీడీ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బుధవారం సాయంత్రం సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, శ్రీవారి వాహన సేవలలో వినియోగించే వివిధ వాహనాల పటిష్టత, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, వాహనాల పార్కింగ్, ..ఇత్యాది అంశాలపై చర్చించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, టీటీడీ విభాగాధిపతులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతూ టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ

ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

తిరుపతి కల్చరల్: పట్టణ ప్రాంతాల్లో వెనుకబడి వర్గాల తల్లులు, చిన్నారులకు ఉచిత పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా మలబార్ గ్రూప్ నర్చరింగ్ బిగినింగ్స్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం హెడ్ రెజీష్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను మలబార్ చారిటబుల్ ట్రస్ట్ అమలు చేస్తుందని చెప్పారు. ప్రారంభ దశలో ఢిల్లీలో అమలు కానున్న ఈ ప్రాజెక్ట్ తర్వాత అన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నట్టు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో మలబార్ తన బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చేందుకు తమ చైర్మన్ సంకల్పించినట్లు తెలిపారు.



మంత్రిపై వ్యక్తిగత దూషణలు అవాస్తవం

తిరుపతి కల్చరల్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితపై తాను వ్యక్తిగత దూషణలు చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది అవాస్తవమని ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వద్ద వ్యక్తిగత ప్రయోజనం పొందాలనే దురుద్దేశంతో కొందరు సామాజిక మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, వీటికి స్వస్తి పలకపోతే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కురుబ, కురువ, కురుమ సంఘం అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు రవిశంకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, రాజన్న, రమణయ్య, గిరిబాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పార్క్‌లో మొక్కలు నాటారు

తిరుపతి తుడా: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కరకంబాడి రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కాలనీలోని పార్క్‌లో బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు

ఆయనను వెంటనే తొలగించండి



వీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సురేంద్ర బాబును ఎగ్జామినేషన్ డీన్ పదవి నుంచి వెంటనే తొలగించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున వీసీ అప్పారావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 2021లో ప్రొఫెసర్ కృష్ణమూర్తి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ, డాక్టర్ సురేంద్ర బాబు అర్హతలపై నిశితంగా పరిశీలించి ఒక నివేదిక సమర్పించిందని, ఆ నివేదికలో డాక్టర్ సురేంద్రబాబు ఆ పదవికి అర్హత లేనట్లు స్పష్టంగా తేల్చిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, అకడమిక్ డీన్ పదవి కేవలం అర్హత కలిగిన ప్రొఫెసర్లకు మాత్రమే ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి కుమార్ యూనివర్సిటీ నాయకులు తేజ పాల్గొన్నారు.

'సింధూరం'..క్యాపిటల్ గ్రంథ సారం



మాట్లాడుతున్న ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

తిరుపతి కల్చరల్: శ్రమ విలువను, మానవ నాగరికత పరిణామ క్రమాన్ని, మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంతో కవితాత్మకంగా రచించిన దీర్ఘ కవితా గ్రంథం 'సింధూరం' అని పలువురు వక్తలు విశ్లేషించారు. సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు, ఉష దంపతులు రచించిన 'సింధూరం' (పెట్టుబడికి కవితల కట్టుబడి) కావ్యంపై బుధవారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ 'సింధూరం'ను పరిచయం చేశారు. ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య వీసీ. వెంకటేశ్వర్లు సమీక్షించారు. అనంతరం ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ మల్లేశ్వరరావు, కవులు, రచయితలు డాక్టర్ ఎన్.ధర్మయ్య, డాక్టర్ గాలి గుణ శేఖర్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న ప్రసంగించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, కిరణ్ క్రాంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న నేతలు

తిరుపతి రూరల్: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి అన్నారు. దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ప్రతిఒక్కరూ ధ్యాన మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న బ్రహ్మర్షి శివరామప్ప

తిరుపతి కల్చరల్: విశ్వశాంతిని కాంక్షిస్తూ పీఎంసీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ధ్యాన మహాయజ్ఞం చేశారు. ఇందులో భాగంగా పిరమిడ్ ఆస్థాన విద్వాంసులు వయోలిన గణేష్ బృందం ప్రదర్శించిన సామూహిక అఖండ సంగీత నాదధ్యానం ఆకట్టుకుంది. బ్రహ్మర్షి శివరామప్ప, పిరమిడ్ మాస్టర్ ఓయూ.రాము, అర్చనరాజ్, క్వాంటమ్ ఫౌండేషన్ సీఈఓ పి.చంద్రశేఖర్, పీఎంసీ ఎండీ ఆనంద్‌కుమార్, డైరెక్టర్ సిద్ధనాగేశ్వరరావు. మాజీ సీబీఐ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్, డాక్టర్ స్నేహ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: టీటీడీ సీపీఎస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ప్రసాదరావు, గౌరవ సలహాదారులుగా ఏ.వెంకటేశం, అధ్యక్షుడిగా దయాకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకట మునిరాజు, కోశాధికారిగా తిరుమలమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా శ్రీలక్ష్మి, రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవికుమార్, హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరేష్, మునికిరణ్ కుమార్, మధుసూదన్‌రావు, శంకరప్ప, సువర్ణ రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా హేమచంద్ర, కె.ధనంజయ, కుమార్, నరేష్ కుమార్, గోవర్ధన్, శ్రీనివాసులు, నరసింహులు, మహిళా కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, శ్రీవాణి, కార్యవర్గ సభ్యులుగా మరో 14మందిని ఎంపిక చేశారు.

ప్రభుత్వ కళాశాలలకు స్థలాలు చూపరూ!

తిరుపతి అర్బన్: తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలకు అవసరమైన మేరకు స్థలాలు కేటాయించాలని బుధవారం ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో దళిత నేత సుధాకర్ మాదిగ, బీసీ విద్యార్థి నేత తిరుమలేష్, ఎస్టీ విద్యార్థి నేత మహేంద్ర నాయక్, రాయలసీమ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు జ్యోతి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అపచారాలు మీరు చేసి కేసులు భూమనపై పెడతారా..?



మాట్లాడుతున్న రవిచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతోపాటు అధికారులు టీటీడీలో వరుసగా అపచారాలు చేసి వాటిని ప్రశ్నించినందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై కేసులు పెడతారా? అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అలిపిరి పాదాల చెంత మలమూత్రాలు, మద్యం బాటిళ్ల మధ్య మహావిష్ణువు విగ్రహాన్ని పడవేయడాన్ని చూసి చలించిపోయిన భూమన కరుణాకరరెడ్డి టీటీడీ పాలకవర్గం, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. అయితే అక్కడ ఉన్నది మహావిష్ణువు కాదని, శనేశ్వరస్వామి విగ్రహమంటూ టీటీడీ చైర్మన్‌తో పాటు టీడీపీ నాయకులు చెప్పడం ఎంతో బాధాకరమన్నారు. కూటమి నాయకులు మహావిష్ణువు విగ్రహానికి, శనేశ్వరుని విగ్రహానికి తేడా కూడా తెలియదా? అని విమర్శించారు. టీటీడీలో మొదలైన లడ్డూలో జంతువుల కొవ్వు నుంచి వైకుంఠ టోకెన్ల జారీలో తొక్కిసలాట, గోశాలలో గోవుల మృతి, శ్రీవారి ఆలయంలోకి చెప్పులు వేసుకుని వెళ్లడం, తిరుమలలో విచ్చలవిడిగా మద్యం, మాంసం విక్రయించడం వంటి ఘోర అపచారాలను ఎప్పటికప్పుడు భూమన కరుణాకరరెడ్డి ఎత్తిచూపి ప్రశ్నించారన్నారు. టీటీడీలో లోపాలను ఎత్తి చూపడాన్ని తట్టుకోలేక భూమన కుటుంబంపై టీటీడీ చైర్మన్ , టీడీపీ నాయకులు హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ ఆరోపణలు చేస్తూ వారిని నగరం నుంచి బహిష్కరించాలంటూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హిందూధర్మాన్ని పరిరక్షించడంలో కానీ, శ్రీవారి ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని తిరుపతి నగరం నుంచి బహిష్కరించే దమ్ము ఎవరికైనా ఉందా? అని సవాల్ చేశారు.

భూమన నివాళి



సరోజమ్మకు నివాళులర్పిస్తున్న భూమన

తిరుపతి మంగళం: తిరుపతి చెన్నారెడ్డికాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు సరోజమ్మ బుధవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు బొగ్గుల వెంకటేష్, పెరుగు బాబూయాదవ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతలకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డిని, అలాగే తిమ్మినాయుడుపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చెంగల్‌రాయలును భూమన కరుణాకరరెడ్డి పరామర్శించారు. వారిని కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్‌కుమార్ కూడా పరామర్శించారు.

'పల్లినేని'కి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి..

చంద్రగిరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత పల్లినేని సుబ్రమణ్యం నాయుడు(51) భౌతిక కాయానికి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నివాళులు అర్పించారు. బుధవారం గడ్డకిందపల్లెలోని ఆయన ఇంటి వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. అలాగే టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ నేతలు మల్లం చంద్రమౌళి రెడ్డి, షేక్ మస్తాన్, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పాకాల చరణ్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డి ఉన్నారు. అలాగే, ఐతేపల్లెలో పార్టీ సానుభూతి పరుడు హర్షద్ మెహతా (జుబేర్) భౌతిక కాయానికి హర్షిత్ రెడ్డి నివాళులు అర్పించారు.



పల్లినేని సుబ్రమణ్యం నాయుడుకు నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి